## క్లుప్తంగా

### రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు

**పెనమలూరు:** యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర్వామివారి దేవస్థానంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానంలో ఉదయం స్వామివారికి అభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు జీవీఆర్ సాగర్ స్వామివారిని 108 కేజీల మల్లెపూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### శాకంబరీ మాతగా విజయ రాజరాజ్వేరి అమ్మవారు



**పెనమలూరు:** పెద పులిపాక గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీ విజయసుందరేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించారు. శ్రీవాసుదేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా ఆదివారం ఆలయంలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

### పేరంటాలమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

**రామవరప్పాడు:** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానంలో ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు బారులు తీరారు. శనిత్రయోదశి సందర్భంగా గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపం వద్ద శనీశ్వరుని అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఈఓ పి.లోకేశ్వరి ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### నిత్యావసరాలు అందజేత



**కంకిపాడు:** పేదలను, అన్నార్తులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని దాతలు కోరారు. అక్షర యూత్ వెల్ఫేర్ సొసైటీ, గాడ్ హెల్ప్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కంకిపాడు బైపాస్ మార్గంలో నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు నిత్యావసరాలను శనివారం పంపిణీ చేశారు. ఆయా సొసైటీల అధ్యక్షులు కె.శివయ్య, ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. అభాగ్యులకు సాయం అందించటం సామాజిక బాధ్యత అన్నారు. మాజీ సర్పంచ్ వజ్రకుమారి, లక్ష్మి, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పెదపులిపాకలో కార్నియాల సేకరణ



**పెనమలూరు:** పెదపులిపాక గ్రామానికి చెందిన ముసునూరు పూర్ణచంద్రరావు(82) శనివారం మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులు కార్నియాలు దానం చేశారు. సక్షం సంస్థ ద్వారా తాడిగడప ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు పూర్ణచంద్రరావు కార్నియాలు సేకరించారు. ఇతరులకు చూపు ప్రసాదించాలంటే నేత్రదానం చేయాలని వైద్యులు సూచించారు.

### విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**కంకిపాడు:** విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజ్ మెకానికల్ విభాగం హెచ్ఓడీ రావి సురేష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా ఈడుపుగల్లు శ్రీవిద్యాలయ హైస్కూల్‌లో నైపుణ్య ప్రదర్శన నిర్వహించారు. రావి సురేష్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. దేశ ప్రగతిలో విద్యార్థులు ముఖ్యభూమిక పోషించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ యార్లగడ్డ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ.. విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎన్‌టీటీఎఫ్ కళాశాలలో అవగాహన సదస్సు**

**గన్నవరం:** యువత వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు రావి సురేష్‌బాబు సూచించారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎన్‌టీటీఎఫ్ కళాశాలలో శనివారం యువత నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహీధర్, మేనేజర్లు పద్మజ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్షతో సత్వర సేవలు

- అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రజలకు సర్టిఫికెట్ల అందజేత

**పెనమలూరు:** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందిస్తున్నామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ డాక్టర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. యనమలకుదురులో శనివారం సచివాలయం 1లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో చాలా కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు వారం రోజుల్లోనే జారీ చేస్తున్నామని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇళ్లకు వెళ్లి సమస్యలు నమోదు చేసి సమస్యల పరిష్కారానికి సహాయపడుతున్నారన్నారు. గ్రామస్తులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా 1,070 సర్టిఫికెట్లు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, డెప్యూటీ కమిషనర్ అఖిలేష్, వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్, నాయకులు వెలగపూడి వరప్రసాద్, మరీదు శ్రీనివాసరావు, యార్లగడ్డ వీరబాబు, కోసూరి నరేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పునాదిపాడులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఇందుపల్లిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ సరోజిని



సర్టిఫికెట్ అందజేస్తున్న గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, సర్పంచ్ పూర్ణచంద్రరావు

**2,643 ధ్రువీకరణ పత్రాల జారీ..**

**పెనమలూరు:** పెనమలూరు మండలంలో ఆరు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తి చేశామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఆమె శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వివరాలు తెలుపుతూ మండల పరిధిలోని ఆరు గ్రామాల్లో 11 సచివాలయాల్లో ఈ నెల 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జగనన్న సురక్ష నిర్వహించామన్నారు. 239 వలంటీర్ల క్లస్టర్లు ఉండగా 15,813 గృహాలు పర్యటించి 4,037 సేవలను వలంటీర్ యాప్‌లో నమోదు చేశామని చెప్పారు. 2643 మందికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశామని వివరించారు. ప్రభుత్వ ఆదేశాలతో మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



పెనమలూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీతాశర్మ



యనమలకుదురులో సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు, నాయకులు

**సంక్షేమ ప్రభుత్వానికి మరో మారు అవకాశం ఇవ్వాలి**

**కంకిపాడు:** సంక్షేమ ప్రభుత్వానికి మరో మారు అవకాశం ఇవ్వాలని నాయకులు కోరారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సచివాలయం-1, 2 పరిధిలో రెండు ప్రత్యేక క్యాంపులు శనివారం నిర్వహించారు. సచివాలయం-1లో 380 మందికి, సచివాలయం-2లో 350 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు బాసటగా నిలవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హత ఉండి పథకాలు అందక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి పూర్తి భరోసా కల్పించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ సర్కారు పని చేస్తోందన్నారు. మండల ప్రత్యేకాధికారి షాహిద్‌బాబు మాట్లాడుతూ.. సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగ్గా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, ఎంపీటీసీలు మార్తమ్మ, కూరపాటి విజయకుమారి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్, సగర కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాసరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, ఈఓ వెంకటేశ్వరరావు, నాయకులు ముసిబోయిన వెంకటేశ్వరరావు, పిడికిటి రామకోటేశ్వరరావు, తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌బాస్కర్ పాల్గొన్నారు.

**సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సత్కారం**

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పురస్కరించుకుని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు.

**జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి**

**ఉంగుటూరు:** ఇందుపల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వి.సరోజిని మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం కుల ధ్రువీకరణ 78, ఆదాయ ధ్రువీకరణ 49, రైస్‌కార్డులు 31, సాంకేతిక సమస్యల వలన రానివారు ఆరుగురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వెంకటలక్ష్మి, ఎంపీడీవో శేషగిరిరావు, ఎంపీటీసీ కె.వెంకట్రామయ్య, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ కె.తులసీరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**జగనన్న సురక్షతో విప్లవాత్మక మార్పులు**

**రామవరప్పాడు:** జగనన్న సురక్ష ద్వారా పాలనలో విప్లవాత్మకమైన మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించి లబ్ధిదారులకు మొత్తం 626 సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, తహసీల్దార్ జాహ్నవి, ఉపసర్పంచ్ టంకశాల ప్రసాద్, వీఆర్వో పవన్‌కుమార్, ఎంపీటీసీలు రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాస్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన**

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం ఓగిరాలలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ కగ్గా పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 487 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు పాల్గొన్నారు.

### 691 ధ్రువీకరణ పత్రాలు అందజేత

**నున్న(విజయవాడరూరల్):** ప్రభుత్వ సేవలందించే వలంటీర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. నున్న గ్రామ సచివాలయం 3 వద్ద శనివారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. నాగిరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి సర్వే చేసిన వలంటీర్లు ప్రజల అవసరాలను తెలుసుకుని 691 ధ్రువీకరణ పత్రాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన శిబిరంలో సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనరు పోలారెడ్డి చంద్రారెడ్డి, ప్రత్యేక అధికారి బి.రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నున్నలో సర్టిఫికెట్ అందజేస్తున్న నాయకులు

### సమర్థవంతంగా వైద్య సేవలందించాలి



**కంకిపాడు:** ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు సమర్థవంతంగా అందించాలని ఏపీ స్టేట్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ రామిరెడ్డి ఆదేశించారు. మండలంలోని ఈడుపుగల్లు ఉపకేంద్రం, సచివాలయం-2, ఉప్పలూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను తనిఖీ చేసి వైద్య సేవలు అందిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్క గ్రామంలోనూ క్రమం తప్పకుండా వైద్యం అందేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సంపత్‌కుమార్, ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలి

**గన్నవరం:** ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకురావాలని వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఏపీ పీజీ సెట్ ఫిజిక్స్ విభాగంలో 7వ ర్యాంక్ సాధించిన కళాశాల విద్యార్థిని చందు పావన్యకి శనివారం ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోపిశెట్టి వీరాస్వామి రూ.10 వేలు నగదు అందజేశారు. విద్యార్థినిని పలువురు అభినందించారు.

### బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**పెనమలూరు:** వివిధ కారణలతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శనివారం పరామర్శించారు. తాడిగడపకు చెందిన పార్టీ సానుభూతిపరుడు మల్లవరపు పెద రత్తయ్య ఈ నెల 2న మృతి చెందారు. ఎమ్మెల్యే పార్థసారథి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే తాడిగడపలో సకలాబత్తిన ఆంజనేయులు మరణించటంతో సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కానూరుకు చెందిన చిన్నారి డి.రిత్విక్ వణుకూరులో విద్యుదాఘాతానికి గురై మృతి చెందటంతో బాలుడి తల్లిదండ్రులను పరామర్శించారు.

## క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

డీఈఓ తాహెరా సుల్తానా

**కంకిపాడు:** విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పని చేయాలని డీఈఓ తాహెరా సుల్తానా ఆదేశించారు. పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. పలు పాఠశాలల్లో జీఈఆర్ నమోదు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, పాఠశాలల్లో చేరికపై సమీక్ష చేశారు. విద్యార్థులందరూ జగనన్న గోరుముద్ద సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందేలా చూడాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. ప్రజాప్రతినిధుల సేవలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ ఫలితాలు, విద్యార్థుల సంఖ్య పెంపుదలపై దృష్టి సారించాలన్నారు. కంకిపాడులో విద్యార్థుల సంఖ్య తగ్గుదలకు సంబంధించిన కారణాలపై హెచ్ఎంను నివేదిక సమర్పించాలని సూచించారు. ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ షాక్ తగిలిన ఘటనపై హెచ్ఎం పద్మావతికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. షోకాజ్ నోటీసుపై హెచ్ఎం వివరణ అందజేశారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు స్థానిక పాఠశాలల్లో పరిస్థితులను డీఈఓకు వివరించారు. ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, కమ్మ, సగర కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

## వైభవంగా కార్మెల్ మాత ఉత్సవాలు

**పెనమలూరు:** మౌంట్ కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 7న ప్రారంభమైన కార్మెల్‌మాత పుణ్యక్షేత్ర మహోత్సవాల చివరి రోజైన శనివారం భక్తుల ప్రార్థనల అనంతరం కానూరు కామయ్యతోపులో పెద్ద ఎత్తున ఊరేగించారు. ఈ సందర్భంగా దివ్యబలి పూజలు చేశారు. కాగా ఆదివారం కార్మెల్‌మాత మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని విచారణ గురువు ఫాదర్ సలివేంద్ర సౌరి తెలిపారు. కార్మెల్‌మాత ఊరేగింపులో కన్య స్త్రీలు, కౌన్సిల్ సభ్యులు, ఉపదేశకులు, లీడర్స్, గంగూరు, పోరంకి, కామయ్యతోపు, సాలిపేట భక్తులు పాల్గొన్నారు.



కార్మెల్‌మాతను ఊరేగిస్తున్న భక్తులు

## వైఎస్సార్ కంటి వెలుగుతో కంటి సమస్యలు దూరం

**కంకిపాడు:** వైఎస్సార్ కంటి వెలుగుతో కంటి సమస్యలు దూరమవుతాయని డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ.. 60 ఏళ్లు నిండిన వృద్ధుల కంటి సమస్యలు కంటి వెలుగుతో పరిష్కారమవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎంతో పటిష్టంగా వైద్యసేవలను ప్రజలకు అందిస్తోందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా వైద్యం అందేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి నికిత, ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్, వైద్య సిబ్బంది శ్యామల, మార్తమ్మ, రాజకుమారి, కనకదుర్గ, జయలక్ష్మి, దుర్గ, చందన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**వైఎస్సార్ కంటి వెలుగు ప్రజలకు వరం**

**గన్నవరంరూరల్:** వైఎస్సార్ కంటి వెలుగు ప్రజలకు వరం అని గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద శనివారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జరిగింది. డాక్టర్ కె.మల్లికార్జునరావు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి కళ్లజోళ్లు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.



ఈడుపుగల్లులో కంటి వెలుగు శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి

## వృద్ధాశ్రమాలను తనిఖీ చేసిన జడ్జి రాజారామ్

**పాతపాడు(విజయవాడరూరల్):** మానవసేవే మాధవసేవ అని నాలుగవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ అన్నారు. పాతపాడు గ్రామంలో శనివారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. జడ్జి పి.రాజారామ్ మాట్లాడుతూ వృద్ధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వృద్ధులకు ఏమైనా సమస్యలున్నట్టయితే మండల న్యాయసలహా సంస్థను ఆశ్రయించవచ్చునన్నారు. అనంతరం జడ్జి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పాతపాడు గ్రామంలో మూడు వృద్ధాశ్రమాలను ఆయన తనిఖీ చేశారు. ప్యానెల్ అడ్వకేట్ రాము, పారాలీగల్ వలంటీరు రామకృష్ణ, యశోద, వృద్ధాశ్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## అత్తింటి వేధింపులపై కేసు నమోదు

**పెనమలూరు:** వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాల ఉర్దూ పాఠశాల రోడ్డుకు చెందిన షేక్.ప్రజ్వల మూడేళ్ల క్రితం నాగుల్‌మీరాను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. భర్త డెకరేషన్ పనులు చేస్తుంటాడు. వీరికి పాప పుట్టింది. అయితే భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకురమ్మని భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త సైదాబీ కూడా వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

## పోలవరం కాల్వ నీరు విడుదల చేయాలని వినతి

**నున్న(విజయవాడరూరల్):** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన పోలవరం కాల్వ నీటిని విడుదల చేయించాలని నున్న గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఎంపీ వల్లభనేని బాలశౌరిని శనివారం విజయవాడలో కలిసి విజ్ఞప్తి చేశారు. నున్న గ్రామంలో పోలవరం కాల్వ నుంచి మోటార్ల ద్వారా చెరువులకు నీరు నింపుకొని వరినాట్లు వేసుకునేందుకు నీటి అవసరం ఉందని వారా వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం నున్న, పాతపాడు పరిసర గ్రామాల్లో రైతులు నారుమళ్లు పోసుకొని నీటి కోసం ఎదురు చూస్తున్నారని తెలియజేశారు. ఎంపీ బాలశౌరి వెంటనే చీఫ్ ఇంజనీర్ నారాయణరెడ్డితో ఫోనులో మాట్లాడి పోలవరం కాల్వకు 17 అడుగుల మేర నీరు వస్తున్నందున పోలవరం కాల్వ ద్వారా నీరు విడుదల చేయాలని కోరారు. తాడిపూడి నుంచి సాగునీరు విడుదల చేయాలని సూచించారు. ఎంపీని కలిసిన వారిలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి, గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, రైతులు పోలారెడ్డి రమేష్‌రెడ్డి, శివశేషిరెడ్డి తదితరులున్నారు.

## ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు

**రామవరప్పాడు:** విద్యార్థులు తమలోని వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విజయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో శనివారం ప్రపంచ యువత నైపుణ్య శిక్షణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించారు. పద్మలత మాట్లాడుతూ నూతన పరిశోధనలు చేసి కొత్త కొత్త ఔషధాలను కనిపెట్టాలని సూచించారు. విద్యార్థులు ఔషధాల తయారీ శిక్షణలో మెలకువలపై అవగాహన పొందారు. బీఫార్మసీ, ఫార్మా.డి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

**గన్నవరంరూరల్:** వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి గ్రామస్తులకు నాణ్యమైన సేవలు అందించాలని ఎంపీడీవో సత్యకుమార్ ఆదేశించారు. మండలంలోని తెంపల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ఇంటి నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులందరూ వెంటనే గృహ నిర్మాణాలు చేసుకునే విధంగా వారికి అవగాహన కలిగించాలన్నారు. ప్రతి ఇంటిని వలంటీర్‌లు సందర్శించి వారు తెలిపిన సమస్యలను వెంటనే సచివాలయ సిబ్బందికి, కార్యదర్శికి, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సర్పంచ్ కొలుసు శిరీష అధ్యక్షత వహించగా పంచాయతీ కార్యదర్శి నామేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి హర్షవర్థిని పాల్గొన్నారు.